క్లుప్తంగా

పద్మశాలీలకు ఆర్థికసాయం వర్తింపజేయాలి

గన్నేరువరం: ప్రభుత్వం పద్మశాలీలకు రూ.లక్ష ఆర్థికసాయం వర్తింపజేయాలని పద్మశాలీ సంఘం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బూర తిరుపతి అన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. పథకానికి సంబంధించి అర్హుల జాబితాలో పద్మశాలీలను చేర్చకపోవడంతో అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతి వృత్తుల వారిలో మేము కూడా భాగమేనని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. రోజు కూలీ పనులు చేసుకుంటే తప్పా పూట గడవని పరిస్థితి ఉందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు బూట్ల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి గాజుల లక్ష్మణ్, కార్యవర్గసభ్యులు వెల్ది తిరుపతి, శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

మేదరి కులస్తులను ఆదుకోవాలి

చొప్పదండి: నియోజకవర్గంలోని మేదరి సంఘం నాయకులు, కులస్తులు గురువారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆయన నివాసంలో కలిసి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. బొంగు వనాలు పెంచుకోవడానికి పది ఎకరాల స్థలం గ్రామాల్లో కేటాయించాలని, కుల సంఘ భవనాలకు నిధులు కేటాయించాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌కు చెందిన దుంపల జీవన్ కుమార్ తాను చదువుకున్న పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌బుక్స్ ఉచితంగా సమకూర్చారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పేద విద్యార్థులకు చదువుభారం కాకూడదని హెచ్‌ఎం రవీందర్ రెడ్డికి బుక్స్ అందించారు. కార్యక్రమంలో బీసవేని రాజశేఖర్, ఆనంద్, రాజమౌళి, మోహన్, శంకర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

గన్నేరువరం: గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ గూడెల్లి తిరుపతి అన్నారు. గురువారం గుండ్లపల్లిలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆలోచనా విధానంలో మిషన్ కాకతీయ పథకంలో చెరువులు, కుంటలను అభివృద్ధి చేయడంతో ఆ ఫలాలు ప్రజలు, మత్స్యకారులకు అందుతున్నాయని తెలిపారు. కాళేశ్వరం జలాలతో చెరువులు నిండి, ఎటు చూసిన పచ్చని పొలాలతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. సాగు నీటితో కరువును అధిగమించి రైతులు సిరుల పంటలు పండిస్తూ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నేతృత్వంలో మానకొండూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతోందని, రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని తెలిపారు. పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. బీఆర్‌ఎస్ పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారనడానికి నిదర్శనమన్నారు.


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న గంగాధర్

గంగాధర: మండలంలో ఉపాధిహామీ కూలీలకు గురువారం సర్పంచ్ మడ్లపల్లి గంగాధర్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉదయం పనులకు వెళ్లాలని, ఎండపూట జాగ్రత్తలు పాటించాలని, పనులు జరిగే ప్రదేశంలో కూలీలకు వసతులు కల్పించాలని సూచించారు.

తహసీల్దార్‌కు వినతి



శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం భూములు సర్వే చేయాలని గురువారం తహసీల్దార్ శ్రీనివాస్ రావుకు చైర్మన్ మల్హారావు, ఈవో సుధాకర్ వినతిపత్రం అందించారు. ఆలయం భూములు పరిరక్షించేందుకు సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలని కోరారు.

రోడ్డు పనుల పరిశీలన



రామడుగు: మండలంలోని వెలిచాలలో సూడా నిధులతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు పనులను గురువారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్ రావు పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు సంజీవరావు, మాజీ సర్పంచ్ రవీందర్‌రావు ఇతరులు పాల్గొన్నారు.

ఆశలు ఫలించేనా..?

- పొడి దుక్కిలోనే పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు
- ముమ్మరంగా సాగు పనులు
- వర్షం కోసం ఎదురుచూపు



పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు



వెదిరలో అచ్చుకొడుతున్న రైతు

రామడుగు: ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు పత్తి సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. భూములను దుక్కి చేసుకుంటున్నారు. రామడుగు మండలంతోపాటు చుట్టుపక్కల మండలాల్లోని వివిధ గ్రామాల రైతులు విత్తనాలు విత్తుతున్నారు. నాలుగు రోజుల నుంచి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే పత్తి విత్తనాల విక్రయాలు ప్రారంభమయ్యాయి. దీంతో రైతులు సిద్ధం చేసుకున్న దుక్కిలో పత్తి అచ్చుకొడుతూ విత్తనాలు నాటుతున్నారు. మండలంలో వరి తర్వాత రైతులు ప్రధానంగా పత్తి పంటను సాగు చేస్తారు. గతేడాది రైతులు 5,210 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ ఏడాది దాదాపు ఆరువేల ఎకరాలకు పైగానే పత్తి పంటను సాగు చేయడానికి సిద్ధ పడుతున్నారు.

పొడి దుక్కిలోనే..

వర్షాలు పడితే పత్తి విత్తనాలు నాటడడం ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు దుక్కులను తయారు చేసుకొని, పొడి దుక్కిలో పత్తి విత్తనాలు నాటుతున్నారు. మరోవైపు వర్షాలు పడితే కూలీల దొరకరని ముందస్తుగా విత్తనాలు వేస్తున్నారు. మండలంలోని వెదిర, వెలిచాల, దేశరాజ్‌పల్లి, మోతె, రుద్రారం, ఇతర గ్రామాలలో ఇప్పటికే దాదాపు మూడువేల ఎకరాలకు పైగానే పత్తి విత్తనాలు వేశారు.

రైతుల ఎదురుచూపు

ముందస్తుగా విత్తనాలు నాటుకున్న రైతులు తొలకరి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. విత్తనాలు నాటుకున్న రైతులకు వర్షాలు పడితే ఎక్కువ శాతం విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంటుందని రైతులు తెలుపుతున్నారు. కాగా విత్తనాలు నాటిన రైతులు మరోవారం రోజుల పాటు వర్షాల కోసం ఎదురు చూడాల్సిందేనని తెలిపారు.

ఐదెకరాల్లో సాగు



ఐదెకరాల నల్లరేగడి భూ మి కౌలుకు తీసుకున్నా. పదిరోజుల క్రితం పత్తి విత్తనాలు వేయడానికి అనుకూలంగా దుక్కి తయారు చేశాను. వర్షాలు పడతాయనే ఆశతో మొత్తం ఐదెకరాల్లో పత్తి విత్తనాలు పెట్టించాను. వర్షం పడితే విత్తనాలు త్వ రగా మొలకెత్తుతాయి. దేవుడిపై భారం వేశాను.

– ర్యాకం శ్రీనివాస్, రైతు, గణేశ్‌నగర్

అంబేడ్కర్ అందరివాడు

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, ఆయన చలవతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తున్నారని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో మాజీ సర్పంచ్ కీ.శే కాటిక రాజమౌళి జ్ఞాపకార్థం ఇందిరానగర్ స్టేజ్ వద్ద నెలకొల్పిన అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ముందుగా గ్రామంలో ముదిరాజ్ సంఘం భవనాన్ని ప్రారంభించి, సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వినోద మాట్లాడారు. తన భర్త రాజమౌళి ఆశయం మేరకు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే రసమయి మాట్లాడుతూ.. భర్త ఆశయం కోసం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పిన వినోదను అభినందించారు. తూర్పు దిక్కు నుంచి దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలని రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 3తోనే సాధ్యమైందన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు ఇనుకొండ జితేందర్ రెడ్డి, గంగిపల్లి సంపత్, మాజీ సర్పంచ్ మెంగని రమేష్, బోయిని కొమరయ్య, తాజుద్దీన్ ఆవుదుర్తి రాంకిషన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు

గంగాధర: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ పుల్కం గంగన్న సూచించారు. మండలంలోని చర్లపల్లి గ్రామంలో గురువారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోనె శ్రీనివాస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి బడీడు పిల్లలు, బడి మధ్యలో మానేసిన చిన్నారులను పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజన సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గంగాధర: కులవృత్తులను ప్రోత్సహిస్తూ, కుల సంఘాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో గురువారం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన మేదరి కుల సంఘం సభ్యులతో మాట్లాడారు. మేదరి కుల సంఘాల అభివృద్ధికి సహకరించాలని కోరగా ప్రతి మండలంలో కుల సంఘం భవన నిర్మాణానికి రూ.ఐదు లక్షలు మంజూరు చేయనున్నామని హామీ ఇచ్చారు.

నూతన నియామకం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

మానకొండూర్: తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం మానకొండూరు మండలశాఖ అధ్యక్షుడిగా ఖాదర్ గూడెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ కనవేని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జెట్టి కొమురయ్యను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుచ్చన్న యాదవ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రఘునందన్, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా శీతాల గణేష్, తిరుపతి, కార్యదర్శిగా ఎర్ర అశోక్ యాదవ్, కోశాధికారిగా సీత రవి, ప్రచార కార్యదర్శిగా అమ్ముల శ్రీనివాస్ యాదవ్, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

చొప్పదండి: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్నామని బీజేపీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ శ్రావణ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ బాల్ రెడ్డి తెలిపారు. గురువారం పార్టీ మండల అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలో ప్రచారం నిర్వహించారు. 12న కొండగట్టులో నిర్వహించే సభకు తరలిరావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో వెంకటరమణారెడ్డి, సంపత్, వనిత, కల్యాణ్, మహేశ్, వీరేశం, రాములు, వంశీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



చొప్పదండి: ప్రతిష్ఠించిన దేవతా విగ్రహాలు

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్‌లో భూలక్ష్మి, మహాలక్ష్మి దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సమష్టిగా చందాలు పోగు చేసి మూడు రోజుల పాటు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలు ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నదానం చేశారు.

భూమిపూజ

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారంలో ముదిరాజ్ కులస్తుల దైవం పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణం కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు గురువారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా రూ.15 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కేడీసీసీ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, కౌన్సిలర్ బొంగోని వీరన్న, మారెపల్లి భిక్షపతి, శ్రీకాంత్‌రెడ్డి, ముదిరాజ్‌లు, నాయకులు పాల్గొన్నారు. భూమిపూజకు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హాజరై పూజలు చేశారు. వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మల్లారెడ్డిపల్లిలో..

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో భూలక్ష్మి, మహాలక్ష్మి బొడ్రాయి



వీణవంక: పూజలు చేస్తున్న కౌశిక్‌రెడ్డి

ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. తనవంతుగా గ్రామానికి సహకారం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుకతిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాదవరెడ్డి, ఇప్పలపల్లి మధుసుదన్‌రెడ్డి, గొట్టిముక్కుల రవీందర్ రావు, సమ్మిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ ఎల్లారెడ్డి, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు పల్లెర్ల కిరణ్, యూత్ నాయకులు నాని తదితరులు ఉన్నారు.

సిర్సపల్లిలో...

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామం శివాలయంలో గురువారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమానికి పాడి కౌశిక్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓగులాపూర్‌లో...

చిగురుమామిడి: మండలంలోని ఓగులాపూర్‌లో గురువారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు నెత్తిన బోనంతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుల్ల మధ్య బైండ్ల కళాకారుల ఆటపాటల మధ్య అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్‌శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయ్‌పాల్‌రెడ్డి, రిటైర్డ్ ఆర్డీఓ ఈశ్వరయ్య, వార్డు సభ్యులు అంజిరెడ్డి, అశోక్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, మోహన్‌రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



చిగురుమామిడి: ఓగులాపూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



ఇల్లందకుంట ఊరచెరువు వద్ద బతుకమ్మతో జడ్పీచైర్‌పర్సన్ విజయ



హుజూరాబాద్‌లో మహిళలు, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి

ఊరూరా చెరువుల పండుగ

సాక్షినెట్‌వర్క్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో చెరువుల పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో చెరువుల పండుగ చీకట్లో జరుపుకున్నారు. అధికరుల తీరును గ్రామస్తులు విమర్శించారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నెత్తిన బోనంతో మహిళలతో కలిసి చెరువు వద్దకు వెళ్లారు. కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. చెరువు గట్టు ప్రాంతాల్లో సహపంక్తి భోజనం, డీజే పాటలకు నృత్యాలు చేశారు. ఇల్లందకుంట ఊర చెరువు వద్ద జెడ్పీచైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ..కాళేశ్వరం ప్రాజెక్టుతో చెరువులు జలకళ సంతరించుకున్నాయని అన్నారు. వీణవంక మండలం వల్బాపూర్‌లో ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి, ఎల్బాకలో జెడ్పీటీసీ మాడ వనమాలసాదవరెడ్డి, దేశాయిపల్లిలో ఎంపీపీ ముసిపట్ల రేణుక, వీణవంకలో సర్పంచ్ నీల కుమార్ గ్రామస్తులతో ఆడిపాడారు. హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక త్తిన బోనంతో పట్టణ శివారులోని గుండ్ల చెరువుకు తరలి వెళ్లారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ హాజరయ్యారు. రామడుగు మండలంలో చెరువుల పండుగ ఘనంగా నిర్వహించారు.చెరువుల వద్ద మహిళలు బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఎంపీపీ కవిత, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్ రావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండ అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చొప్పదండి మండలంలోని ఆయా గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మ దేవాలయాల వద్ద బలిహరణం, సామూహిక భోజనాలు చేశారు. రైతులు పార్టీలకు అతీతంగా పాల్గొని వేడుకల్లో పాల్గొన్నారు. గంగాధర మండలంలోని అన్ని గ్రామాలలో చెరువుకట్టల వద్ద ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు.



తిమ్మాపూర్: పాట్టేలుతో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



చొప్పదండి: ఊరూరా చెరువుల పండుగలో రైతులు, గ్రామస్తులు



గంగాధరలో బతుకమ్మలతో మహిళలు



రామడుగులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కందుగల గ్రామానికి చెందిన ఇప్పలపల్లి హరికృష్ణ, శివరాంలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ పరామర్శించారు. వెంట నాయకులు పానుగంటి కిరణ్‌రెడ్డి, సాంబయ్య, రత్నాకర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, వెంకటేష్, రవి, దయాకర్ తదితరులు ఉన్నారు.

సన్మానం



గంగాధర: మండలంలోని మల్లాపూర్‌లో పెద్దమ్మతల్లి బోనాల జాతర సందర్భంగా గుడి అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన తూడి లచ్చయ్య రూ.మూడు లక్షల ఇరవై వేలతో సీసీ బెడ్ వేయించాడు. ఆపదలో ఉన్నవారికి ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు దేవాలయ అభివృద్ధికి సహకరించిన లచ్చన్నను ముదిరాజ్ సంఘం సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు.